# జాణవులే...

అమిరపు విష్ణుప్రియ

''ప్చ్! ఈ హైదరాబాద్ సంబంధం కూడా కుదిరేలా లేదు'' అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన భర్తకు కాఫీ కప్పు అందిస్తూ నిట్టూర్చింది శ్యామల.


''ఏం ఎందుకలా అంటున్నావ్?'' భార్య వైపు అర్థం కానట్టుగా చూస్తూ అడిగాడు శ్రీనివాసరావు. మళ్ళీ ఆయనే అన్నాడు.

''మన అమ్మాయి తెల్లటి తెలుపు కాకపోయినా, కనుముక్కుతీరు చక్కగా వుండి, ముఖం కళకళలాడుతూ వుంటుంది. ఇంజనీర్నీ, డాక్టర్నీ చెయ్యలేకపోయినా, డిగ్రీ వరకూ చదివించాం. వినయ విధేయతలూ, పెద్దల పట్ల గౌరవం వున్న సుగుణాలరాశి మన పిల్ల. దాన్నెవరు కాదంటారే? కళ్ళకద్దుకొని చేసుకుంటారు'' గర్వంతో కూడిన చిరుమందహాసం ఆయన పెదవులపై కదిలింది.

''ఆఁ... మన పిల్ల మనకలాగే అనిపిస్తుంది గానీ, మొన్న మనింటికొచ్చి మనమ్మాయిని చూసెళ్ళిన ఆ పెళ్ళివారు, సుశీల కూతురు శిరీషను కూడా చూసి వెళ్ళారుట. అదేనండీ, సుశీల అంటే- మనం సంతపేటలో వున్నప్పుడు మన ప్రక్కవాటాలో వుండేవారు చూడండీ, ఆవిడ. ఇందాక కూరగాయల మార్కెట్‌లో కనిపించింది. నన్ను చూసి దగ్గరకొచ్చి పలకరించింది. కుశలప్రశ్నలేసుకుంటుండగా పిల్లల పెళ్ళి ప్రస్తావన వచ్చింది. మీ దివ్య, మా శిరీష ఈడుదేగా, సంబంధాలు చూస్తున్నారా? అని అడిగింది. మొన్న చూసి వెళ్ళిన హైదరాబాద్ సంబంధం వివరాలు చెప్పగానే ఆవిడ ఆశ్చర్యపోయింది. విషయమేమిటంటే, ఈ పెళ్ళివారే వాళ్ళ అమ్మాయి శిరీషను కూడా పెళ్ళిచూపులు చూశారుట. మనకు చెప్పినట్టుగానే ఏ విషయం నాలుగైదు రోజుల్లో కబురుచేస్తామని చెప్పివెళ్ళారుట. అదీ పరిస్థితి.

సుశీల వాళ్ళ అమ్మాయి శిరీష తెల్లగా దంతపు బొమ్మలా వుంటుంది. అంతేకాదు, ఆ పిల్ల ఎం.సి.ఏ కూడా చదివింది. ఏ విధంగా చూసినా దాంతో పోలిస్తే, మన దివ్య వాళ్ళ కంటికి ఆనదు.

వినయం, విధేయతా, తెలివితేటలూ, ఇవన్నీ



## కోటితార

తారల రెమ్యూనరేషన్లు భారీగా పెరిగిపోయి సినిమాల బడ్జెట్ ఆకాశానికెళ్ళిపోతున్న రోజులివి. అందాల అపరంజిబొమ్మ అమీషా పటేల్ ఇప్పుడు 'కోటి"తారగా వెలిగిపోతోంది. అమీర్‌ఖాన్‌తో కలిసి 'ది రైజింగ్'లో నటిస్తున్న ఈ తార అకస్మాత్తుగా తన రెమ్యూనరేషన్ని కోటిరూపాయలు చేసేసిందని అంతా అంటున్నారు. ఇదిలా ఉంటే తెలుగులో మహేష్‌బాబు సరసన నటిస్తున్న ఈ భామ ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ సరసన నటించడానికి ఇంత మొత్తాన్ని డిమాండ్ చేసిందని సినీవర్గాలు చెబుతున్నాయి. ఈమెని కలుసుకుని సినిమా ఆఫర్ గురించి అడగడమే పొరపాటని ఇప్పుడు నిర్మాతలకి తెలిసివచ్చింది. అమీషా ఇది విన్నావా?



ఎవరు చూస్తున్నారూ... చూడగానే కన్పించేవి అందం, చదువు, కట్నం. ఓ పది సంబంధాలు చూడటం, వాటిల్లో ఏ బేరం బావుంటే అది కుదుర్చుకోవడం. కుర్రాళ్ళు, అందం చదువు చూస్తే... తల్లిదండ్రులు, కట్నం ఎంత వీలయితే అంత రాబడదాం అని చూస్తారు. ఇక మన విషయంలో కట్నం కూడా నామమాత్రంగానే ఇచ్చుకోగలం. అబ్బాయి బాగున్నాడు, మంచి ఉద్యోగస్థుడు, ఇచ్చిచేస్తే పిల్ల సుఖపడ్తుందని ఆశపడ్డాను. ఇక ఆశ వదులుకోవడమే మంచిది'' శ్యామల కంఠంలో బాధ తొంగిచూసింది. భార్య చెప్పింది విన్నాక శ్రీనివాస రావు కూడా ఆలోచనలో పడ్డాడు.

కొద్దిక్షణాల క్రితమే స్నానం ముగించి బెడ్‌రూమ్‌లో, చీర కట్టుకుంటున్న దివ్య, తల్లిదండ్రుల సంభాషణంతా పూర్తిగా విన్నది. తల్లి నిరాశ దివ్య మనసులో ముల్లులా గుచ్చుకుంది. వారం రోజుల క్రితం తనని పెళ్ళిచూపులు చూడటానికి వచ్చాడు నవీన్. పేరుకు తగ్గట్టే అందమైన రూపం. చూడగానే మంచి కుర్రాడిలా కన్పించేసరికి మక్కువ పెంచుకుంది. హైదరాబాద్‌లో పెద్ద కంపెనీలో ఎగ్జిక్యూటివ్- ఇంకేముంది, కలలు కనడం మొదలెట్టింది. ఈవారం రోజుల నుంచీ ఇదే పని. ఎన్నివేల కలలు కన్నదో తనకే తెలియదు. మరి తన ఊహల వాహినికి ఆనకట్ట వేస్తూ, అమ్మేంటీ ఇలా అంటుంది. తన ఆశల్ని వదులుకోవాలా? తన కలల రాకుమారుడు నవీన్‌ని మర్చిపోవాలా? అదెలాసాధ్యం... తన వల్ల కాదు. అతణ్ణే భర్తగా వూహించుకుంటూ, తను కంటున్న కలల్ని తప్పకుండా నిజం చేసుకోవాలి... నిజం చేసుకోవాలి... అవును చేసుకుంటుంది. అందుకు తనేం చెయ్యాలి? బాగా ఆలోచించింది. చక్కటి ఐడియా మనసులో రూపుదిద్దుకోగానే హృదయం తేలికై పెదవులపై చిరునవ్వు విరబూసింది.

''అమ్మా వెళ్ళొస్తాను'' ఒక చేతిలో చిన్న సూట్‌కేసు, మరో చేతిలో హేండ్‌బ్యాగ్‌తో బయటకు నడిచింది దివ్య.

''ఏం ఇంటర్వ్యూలో ఏమిటో? పెళ్ళి చేసుకొని అత్తారింటికెళ్ళి హాయిగా కాపురం చేసుకునే వయసులో... అసలే హైదరాబాదు మహానగరం, ఒక్కదానివే వెళ్తున్నావ్, జాగ్రత్తగా వెళ్ళిరామ్మా'' అంటూ కూతుర్ని సాగనంపింది శ్యామల.

అంతక్రితం ఎప్పుడో తాను అప్లై చేసిన ఉద్యోగానికి రేపు ఇంటర్వ్యూ వుందనీ, హైదరాబాద్ నుండి తన స్నేహితురాలు గీత రాత్రి ఫోను చేసి చెప్పిందనీ, తల్లి దగ్గర అబద్ధం ఆడేసింది దివ్య. అలా అబద్ధం చెప్పడం కొంత ఇబ్బంది కలిగించినా, తప్పదు. అలా కాకుండా, అసలు విషయం తను చెప్పేసిందనుకో... అమ్మో! ససేమిరా ఒప్పుకోదు. తాను అనుకున్నట్టుగా అన్నీ సవ్యంగా జరిగితే... తన తెలివితేటల్ని అమ్మ అభినందిస్తుంది, ఎంతగానో ఆనందిస్తుంది కూడా... మనసుకు సర్ది చెప్పుకుంది.

★ ★ ★

సికింద్రాబాద్ సెంట్రల్ రైల్వేస్టేషన్ కోలాహలంగా వుంది. పెళ్ళిళ్ళ సీజన్ కాబోలు... ప్లాట్‌ఫామ్ అంతా జనసందోహంతో కిటకిటలాడిపోతోంది. ట్రైను విండోలోంచే చూసింది దివ్య. తన కోసం వెతుకుతూ చూస్తున్న గీతని. ''హాయ్ గీతా! హౌ ఆర్ యూ?'' ట్రైనులోంచి దిగుతూ చెయ్యి వూపింది.

''నేను బానే వున్నానుగానీ, నువ్వేంటి ఇలా హఠాత్తుగా వూడిపడ్డావ్, ఉరుము లేని మెరుపులా. రాత్రి ఫోనులో కూడా సరిగ్గా మాట్లాడలేదు. హైదరాబాద్ వస్తున్నాను, స్టేషన్‌కి రమ్మని మాత్రం చెప్పి పెట్టేశావ్'' దివ్య చేతిలో బ్యాగ్ అందుకుంటూ అడిగింది గీత.

''ఇప్పుడే చెప్పాలా? ఇంటికెళ్ళాక చెప్పొచ్చా?''

''ఎప్పుడైనా చెప్పవే బాబూ! అసలు చెప్పకపోయినా ఫరవాలేదు. నువ్వు రావడమే నాకు మహదానందం'' గీత ముఖం నిండా సంతోషం పూలై పూసింది.

ఇంటికొచ్చాక గీత ఇచ్చిన వేడి వేడి టీ త్రాగుతూ తన ప్లానంతా చెప్పింది దివ్య.

''అమ్మో! దివ్యా! ఏమో అనుకున్నాను. నువ్వు అసాధ్యురాలివే. జాణవి సుమా!''

''ఆమాత్రం జాణతనం లేకపోతే ఈ రోజుల్లో

ఆడవాళ్ళు నెగ్గుకురావడం చాలాకష్టం గీతా!''

''అంతేనంటావా?'' అంది గీత.

''అక్షరాలా అంతే!''

''సరే అయితే... త్వరగా రెడీ అయి బయల్దేరు. బెస్ట్ ఆఫ్ లక్'' బొటన వేలు చూపిస్తూ తమాషాగా అంది గీత.

''థాంక్యూ'' లేచింది దివ్య.

రామ్‌నగర్ బస్టాప్‌లో నించుని చేతికున్న వాచీ కేసి చూసుకుంది దివ్య. సరిగ్గా ఉదయం తొమ్మిది గంటలు అయింది. తను బస్టాప్‌కి వచ్చి అప్పుడే పది నిమిషాలు అయింది. హేండ్‌బ్యాగ్‌లో వున్న ఎల్లోకలర్ పేపరు తీసి అందులో వున్న అడ్రసు చూసుకొని తను నిల్చున్న ప్లేస్ కరక్టయినదేనని మరోసారి నిర్ధారించుకొని తృప్తిగా తలపంకించింది.

నవీన్ మోటారుసైకిల్ మీద వెళుతున్నవాడల్లా యధాలాపంగా బస్‌స్టాప్ వైపు చూశాడంతే. తక్కున బ్రేకు వేసి ఆగిపోయాడు. అరె! ఈ అమ్మాయి తను మూడో పెళ్ళిచూపుల్లో చూసిన అమ్మాయిలా వుందే... సందేహం లేదు, ఆ అమ్మాయే. ఈ ఫోటో కూడా తన దగ్గర వుంది. ఈ అమ్మాయేంటి ఇక్కడుంది? కొంత ఆశ్చర్యం కలిగినా, ఏదైనా పనిమీద హైదరాబాద్ వచ్చిందే మోలే అనుకున్నాడు. అనుకున్నదే తడవుగా ''మీరు దివ్య కదూ? ఇక్కడున్నారేంటీ? హైదరాబాద్ ఎప్పుడు వచ్చారు?'' ప్రశ్నలతో పలకరించాడు.

'ఎన్నో పెళ్ళిచూపులు చూస్తారీ మగవాళ్ళు. వెంటనే మర్చిపోకుండా తనని మాత్రం గుర్తుపెట్టుకున్నాడితగాడు. అది చాలు తనకి, తను అనుకున్నది సాధించటానికి...' మనసు సంతోషంతో ఉప్పొంగింది.

''ఓ మీరా నవీన్, బావున్నారా? నేను ఈరోజే హైదరాబాద్ వచ్చాను. మా ఫ్రెండు గీత ఇల్లు స్టేషన్‌కి దగ్గర. ముందు వాళ్ళింట్లో దిగి, రిలాక్సై, మా బంధువులింటికి బయల్దేరాను. మధ్యలో బస్ కోసం వెయిట్ చేస్తున్నాను. ఇదిగో మీరిలా కనిపించారు'' చిరునవ్వుతో చెప్పింది దివ్య.

''ఓ అలాగా! అయితే రండి దివ్యగారూ! నేనుంటున్న ఫ్లాటు ఇక్కడికి దగ్గరే'' పిలిచాడు నవీన్.

ఆమె ఆశించింది అదే. కానీ తను చెప్పింది విని 'అలాగా, అయితే సరేలెండి' అని వెళ్ళిపోతాడేమోనని ఒక్క క్షణం కంగారుపడింది. అతను రమ్మని ఆహ్వానించగానే మనసు ఎగిరి గంతేసింది. మరేం మాట్లాడకుండా ''సరే పదండి'' అంటూ మోటారుసైకిల్ వెనక సీట్లో ఎక్కి కూర్చుంది.

★ ★ ★

తాళం తీసి ఇంటి తలుపు తెరుస్తూ కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యాడు నవీన్. అన్నీ కొత్తగా కట్టిన ఫ్లాట్స్. గోడలకి చక్కని కలర్ కాంబినేషన్‌తో పెయింట్స్, తెల్లటి నునుపైన మార్బుల్ ఫ్లోరింగ్, చక్కగా ఉడ్‌వర్క్ చేయబడిన అల్మారాలతో అందంగా వుందా ఫ్లాట్. హాలు మధ్యలో వున్న రోజ్‌వుడ్ ఫర్నిచర్ మరింత హంగునిస్తోందా ఇంటికి.

ఇంట్లో వుండాల్సిన వస్తువులన్నీ వున్నాయి. కిచెన్ సామాగ్రితో సహా. కానీ ఏ వస్తువు కూడా అది వుండాల్సిన ప్లేసులో లేదు. అస్తవ్యస్తంగా అడ్డదిడ్డంగా వున్నాయి. బట్టలన్నీ సోఫా మీద, మంచాల మీద ఎక్కడపడితే అక్కడే పడేసి వున్నాయి. కంప్యూటర్, టీవీ, ఫ్రిజ్ లాంటి వస్తువులన్నీ అరంగుళం మందాన దుమ్ముకొట్టుకొని వున్నాయి. ''బ్రహ్మచారి ఇల్లు గదండీ, చిందర వందరగా వుంది'' సిగ్గుపడుతూ చెప్పాడు.

''ఫరవాలేదు. సొద్దస్తమానం ఆఫీసు వర్క్‌తోనే మీకు సరిపోతుంది. ఇక ఇవన్నీ చక్కబెట్టుకోడానికి టైమెక్కడుంటుంది? అయినా ఇవన్నీ ఆడవాళ్ళు చేసే పనులు. మీరలా చూస్తూవుండండి, కాసేపట్లో ఇల్లంతా నీట్‌గా చేసేస్తాను'' అంటూ అతని సమాధానం కోసం ఎదురుమాడకుండా, చకచకా దుమ్ముపట్టినవన్నీ దులిపేసి, టకటకా బట్టలన్నీ సర్దేసి, ఇల్లంతా నీట్‌గా తుడిచేసి, అద్దంలా చేసేసింది దివ్య.

నవీన్‌కి ఆశ్చర్యమేసింది. గుంటూరులో వుండే తన పిన్ని కూతురు శశి గుర్తొచ్చింది అతడికి, ఇంచుమించుగా దివ్య వయసుదే. మహా బద్ధకస్తురాలు. ఒక్క పనీ చేతకాదు. ఇప్పటికీ మంచి నీళ్ళు కూడా వాళ్ళ అమ్మే అందించాలి. వంటా వార్పూ, పనీ పాటా నేర్చుకోని ఆడపిల్లలంటే చిరాకు నవీన్‌కి. దివ్య శశిలా కాదు, మంచి పనిమంతురాలు.



## మార్పు

గోవిందా అంటే కామెడీ చిత్రాలు గుర్తుకొస్తాయి. ఆయన ఎక్కువగా కామెడీ చిత్రాలకి ప్రాధాన్యత ఇస్తుంటాడు. అలాంటి గోవిందా ఇప్పుడు తన ట్రెండ్‌ని మార్చేసుకున్నట్టున్నాడు. 'సుఖ్' చిత్రం తనకి కొత్త ఇమేజ్ తెచ్చిపెడుతుందంటున్నాడు గోవిందా. 'కమర్షియల్ హిందీ చిత్రానికి ఉండాల్సిన అన్ని లక్షణాలు ఈ చిత్రంలో ఉన్నాయి. ఎప్పుడూ కొత్తదనానికి ప్రాధాన్యత ఇచ్చే నాకు ఈ చిత్రం మంచి పేరు తెస్తుంది. తమ అభిమాన హీరోని కొత్త గెటప్‌లో చూడాలనుకునే ప్రేక్షకులు ఈ చిత్రం చూసి ఎంతో సంతృప్తి చెందుతారు' అంటున్నాడు గోవిందా.

''కార్యేషుదాసి'' అప్రయత్నంగా అనుకున్నాడు. తొలిసారిగా అతని హృదయంలో ఆమెపై 'ఇష్టం' అలలా కదిలింది.

''మా ఇంటికి తీసుకుని వచ్చి మీకు ఆతిథ్యం ఇవ్వవలసిందిపోయి, మిమ్మల్నే శ్రమపెట్టాను'' మొహమాటంగా నొచ్చుకుంటూ అన్నాడు నవీన్.

''నా ఇల్లుగా భావించే వేశాను. ఏం మీ ఇల్లు నా ఇల్లు అనుకోకూడదా?'' కొంటెగా అడిగింది. ఆమె మాటల్లో గూఢార్థం ఏదో ధ్వనించి చిన్నగా నవ్వాడు నవీన్.

''బాగా అలసిపోయారు. ఒక నిమిషం అలా కూర్చోండి, మంచి కాఫీ కలిపి తీసుకొస్తాను మీకు. అన్నట్టు, నాకు కాఫీ చెయ్యడం మాత్రం బాగానే వచ్చండోయ్...'' అంటూ కిచెన్‌లోకి వెళ్ళబోతున్నవాడల్లా, బయట కాలింగ్‌బెల్ మ్రోగడంతో ముందు గదిలోకి వచ్చి తలుపు తీశాడు. ఎదురుగ్గా చలపతి మామయ్య. అమ్మకి పెదనాన్న కొడుకు. గుండె ఝల్లుమంది నవీన్‌కి.

అనుకోకుండా ఇలా దిగబడ్డాడేంటి ఈయన? ఇక్కడ ఇంట్లో నాతోబాటు ఈమెని చూస్తే... అమ్మో! ఇంకేమైనా వుందా! ఊరెళ్ళగానే చిలవలు పలవలు చేసి గోరంతలు కొండంతలుగా మార్చి, మషాలాతో మిక్స్ చేసి అమ్మానాన్నలకు వినిపిస్తాడు. ఇప్పుడు నేనేం చెయ్యాలి? ఈ ఆపద నుండి ఎలా బయటపడాలి?... దిక్కుతోచ



లేదు నవీన్‌కి.

''ఏరా నవీన్, ఏంట్రా! అలా తెల్లబోయి చూస్తున్నావ్! ఇంతకీ నన్ను లోపలికి రానిస్తావా లేదా?'' గుమ్మానికడ్డంగా నిలబడి తనని పట్టించుకోకుండా ఏదో ఆలోచనలో వున్న నవీన్‌ని చూస్తూ అనుమానంగా అడిగాడు చలపతి మామయ్య.

''ఆఁ... మామయ్యా! రా రా... కూర్చో, బావున్నావా మామయ్యా, అమ్మానాన్న ఎలావున్నారు? అత్తయ్య ఎలా వుంది?'' మనసులో కంగారును బయటకు రానీయకుండా వ్యర్థప్రయత్నం చేస్తూ అడుగుతున్నాడు.

''ఆఁ...అందరూ బాగానే వున్నారుగాని, నువ్వేంటి ఒకటే టెన్షన్ పడుతున్నావ్?''

''అబ్బే! అదేం లేదు మామయ్యా! నాకెందుకూ టెన్షన్? ముందు నువ్విలా కూర్చుని, మన ఊరి విశేషాలు చెప్పు'' అంటూ సంభాషణలోకి దించాడు. ఇంతలో కిచెన్‌లోంచి గాజుల గలగలల చప్పుడు, కప్పుల పింగాణి చప్పుడు వినిపించసాగాయి. ''ఎవర్రా అది, వంటింట్లోంచి చప్పుళ్ళు వినిపిస్తున్నాయ్! అవి ఆడపిల్లల గాజుల చప్పుళ్ళ మాదిరి వున్నాయే'' సాలోచనగా అన్నాడు. అయిపోయింది... తన పని అయిపోయింది. మామయ్య లోపలికి పోయి ఆ పిల్లను చూసేస్తాడు. తన పరువు కాస్తా గంగపాలవుతుంది.

ఒళ్ళంతా చెమటలు పోశాయి నవీన్‌కి. తడబడుతూ ''అదీ... అదీ...'' అన్నాడు.

''ఆఁ... నానండీ బాబాయిగోరూ, భాగ్యాన్ని. ఈ ఇంటి పనిమనిషిని. పనిమనిషిననే మాటేగానీండి, నాను సుబ్బరంగా వుంటానండీ. పని కూడా సుబ్బరంగా జేత్తానండీ'' వచ్చి వాళ్ళిద్దరికీ కప్పుల్లో ఘుమ ఘుమలాడే కాఫీని అందించింది. జడను పైకి చుట్టిపెట్టిన పెద్దకొప్పు, దాని చుట్టూ మల్లెపూలు, కళ్ళనిండా కాటుక, నుదుట పెద్దబొట్టు, 'గోచీలా'- చీరను కాళ్ళమధ్యనుండి వెనక్కి దోపుకుంది. అచ్చంగా పనిమనిషిలా, దానికి తగ్గట్టుగా ఆ భాష కూడా. హ్యాట్స్ ఆఫ్ దివ్యా నీకు... 'కరణేషు మంత్రీ' అనుకున్నాడు మనసులో.

''క్రితంసారి నేనొచ్చినప్పుడు లేవే- ఎప్పుడు పనిలో చేరావ్?'' చలపతి మామయ్య ఆరాలు.

''ఈ మద్దెనే బాబాయిగోరూ- నేను పనిలో జేరి!''

''మంచి పని చేశావమ్మాయ్. రాగానే ఇల్లు ఇంత నీట్‌గా వుందేంటబ్బా అనుకున్నాను. ఇదంతా నీ మహత్యమేనా? బావుంది, చాలాబావుంది. ఇదిగో... వస్తే వచ్చావ్‌గానీ భాగ్యా... ఈ ఇంటిని, మా అబ్బాయినీ ఎప్పుడూ వదిలిపెట్టి వెళ్ళకు, సరేనా?'' కాఫీ తాగి కప్పును భాగ్య చేతికందిస్తూ మెచ్చుకోలుగా చూశాడు.

''భాగ్యా, నీలాగే నీ కాఫీ కూడా ఫస్ట్‌క్లాస్'' మెచ్చుకోలుగా చూశాడు. ''మరి నే వెళ్ళొస్తానురా నవీన్'' అంటూ లేచాడు.

''అదేంటండీ బాబాయిగోరూ... అప్పుడే ఎల్తన్నారు. మరి కాసేపుండి మీ అల్లుడిగారితో మాటలాడి భోజనాలయి జేసినాక ఎల్లొచ్చును గందా?''

''లేదులే భాగ్యా! కోర్టు పనిమీద వచ్చాను. ఈసారి వచ్చినప్పుడు తప్పకుండా నీ చేతి భోజనం చేసే వెళతాను సరేనా! అయినా... నేను రెణ్ణెల్లకొకసారి వస్తూనే వుంటాను. వచ్చినప్పుడల్లా వీణ్ణి కలిసే వెళుతుంటాను. లేకపోతే వీళ్ళమ్మ, అదే నా చెల్లెలు వూరుకుంటుందా? కొడుకు గురించిన వివరాలన్నింటినీ పూర్తిగా అడిగి తెలుసుకుంటేనే గానీ, మంచినీళ్ళు కూడా ఈయదు నాకు'' అంటూ చెప్పులేసుకుని ఆయన వెళ్ళిపోయాడు.

## తిండియావ

**కొంతమంది తినడం కోసం బ్రతుకుతారు. మరికొంతమంది బ్రతకడం కోసం తింటారు. ఇంతకీ అసలు సంగతేంటంటే అందాలతార ఐశ్వర్యారాయ్‌కి తిండి యావ ఎక్కువట. ఎక్కడికైనా ఫంక్షన్‌కి వెళ్లినప్పుడు తనకిష్టమైన వాటిని ఎంతో ఆబగా తింటుందట ఆమె. 'నాకిష్టమైనవి దొరికితే అన్నీ మరచిపోతాను. మా ఫ్రెండ్స్ అంతా నన్ను తెగ తిడతారు. నా జిహ్వాచాపల్యాన్ని నేను వదులుకోలేకపోతున్నాను' అంటోంది. ఆఫర్లు లేక తిండి సయించక కొంతమంది హీరోయిన్లు తెగ సతమతమవుతుంటే ఐస్ మాత్రం ఇలా బ్రేవ్‌మంటోంది.**

తర్వాత... ఊళ్ళో వుంటున్న తన అమ్మానాన్నల గురించి, తన కుటుంబ విషయాలు, తన చదువెలా సాగిందీ, కాలేజీ డేస్‌లో తన అల్లరి, వీటన్నింటి గురించి హుషారుగా నవీన్ చెప్తూంటే ఆసక్తిగా విన్నదామె. అలా మాట్లాడుకుంటుంటే కాలమే తెలియలేదు వాళ్ళిద్దరికీ. గోడకున్న గడి

యారం పన్నెండు గంటలు కొట్టేసరికి ఈ లోకం లోకి వచ్చారు. ''అబ్బా! అప్పుడే పన్నెండు అయిందా! మీతో మాట్లాడుతుంటే, గంటలు క్షణాల్లా గడిచిపోయేటట్టున్నాయ్ దివ్యా! ఇలా మాట్లాడుకుంటూ వుంటే ఎంతసేపైనా ఇలాగే గడిచిపోతుంది'' అంటూ ఆమె వైపు చూశాడు. ఇంకా ఆ పెద్దబొట్టు, చీరకట్టు మార్చలేదు దివ్య. ''ఇక ఈ పనిమనిషి గెటప్ అవసరం లేదులెండి, ఈ గెటప్ మార్చేసి రిఫ్రెష్ అయిరండి. ఏదైనా మాంచి హోటల్‌కెళ్ళి భోంచేసి వద్దాం''

''రోజూ చేసేదేగా హోటల్ భోజనం. ఈరోజు నా వంట రుచి చూద్దురుగాని...'' అంది దివ్య.

''అయ్యో! ఇప్పటికే మిమ్మల్ని చాలా శ్రమపెట్టాను. ఇంకా వంట కూడా చేస్తారా? వద్దు వద్దు'' కంగారుగా అన్నాడు నవీన్.

''ఆడవాళ్ళకు వంట చెయ్యడం పెద్ద శ్రమేంటి? భలేవారే... ఇంకానయం, భోజనం చెయ్యడం కూడా శ్రమ అన్నారు కాదు'' నవ్వేసింది దివ్య.

''కిచెన్‌లో వంటకు కావల్సిన పాత్రలన్నీ వున్నాయి. ఇకపోతే వండటానికి కావల్సిన సరుకులన్నీ ఒక చిన్న లిస్ట్ రాసిస్తాను. అవి తెచ్చారంటే అరగంటలో భోజనం రెడీ చేస్తాను'' అంటూనే చిన్న పేపరు మీద కావల్సినవన్నీ వ్రాసి అతనికి అందించింది. ఆమె వ్రాసిన లిస్ట్ తీసుకొని కిరాణాషాపుకి బయల్దేరాడు నవీన్. అతనికి ఏదో కొత్తగా థ్రిల్లింగ్‌గా వుంది. ఆమె సామీప్యం, ఆ చొరవ, తెలివితేటలూ, చకచకా ఇల్లు దిద్దుతున్న విధానం, అతణ్ణి చాలా అబ్బుర పరుస్తున్నాయి.

★ ★ ★

అరగంట గడిచింది. హాల్లో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడన్నమాటేగానీ, దృష్టి దానిమీద లేదు. వంటింట్లో నుంచి వచ్చే వంటకాల ఘుమఘుమ వాసనలు అతడి ఆకలిని పెంచి నోట్లో నీరూరేలా చేస్తున్నాయి. సన్నగాజుల సుతిమెత్తని సవ్వడి అతని చెవులకు సన్నాయి వాయిద్యంలా వినవస్తోంది.

ఇంతలో ''భోజనం రెడీ, వడ్డించాను రండి'' అంటూ లోపల్నించి తియ్యగా పిలిచింది దివ్య. టేబుల్ మీద పెట్టిన ప్లేటులో వేడి వేడి అన్నం, టమోటా పప్పు, వంకాయ కూర, గోంగూర పచ్చడి, ప్లేటు నిండుగా వడ్డించింది. నాన్‌లకి, రోటీలకి అలవాటు పడిన నోటికి చక్కటి ఆంధ్రాభోజనం అడిగి అడిగి వడ్డించింది. 'భోజ్యేషు మాతా' అనుకున్నాడు నవీన్. చాలారోజుల తర్వాత తృప్తిగా భోంచేశాడు.

కొసరి కొసరి వడ్డించడం వల్ల కొంచెం ఎక్కువగానే తినేశాడేమో సోఫాలో పడుకుని, పేపరు చదువుతూ తెలీకుండానే నిద్రలోకి జారుకున్నాడు నవీన్. మెలకువ వచ్చి చూసేసరికి టైము సరిగ్గా మూడయింది. ఆమె అలికిడి ఎక్కడా విన్పించకపోవడంతో, ఏం చేస్తోందోనని లోపలికి వెళ్ళాడు. బెడ్‌రూమ్‌లో తను పడుకునే మంచం మీదే పడుకుని వుంది. ఆ గుండ్రటి ముఖంలో ఆల్చిప్పల్లాంటి అందమైన కళ్ళు, వంపు తిరిగిన పొడవాటి కనురెప్పలు, కొనదేలిన నాసిక, దానిపై అందంగా మెరుస్తున్న తెల్లరాయి ముక్కుపుడక, ముద్దుగా ముడుచుకున్న ఎర్రటి పెదవులు, గుండ్రటి నునుపైన చుబుకం, వయసు పొంగుతో మిసమిసలాడే యౌవ్వనం. మొత్తంగా అందాల గనిలా వుందామె. మోముపై అలవోకగా ఆటలాడుతున్న ముంగురులు ఆమె అందాన్ని ఇనుమడింపజేస్తూ అతడిలో అలజడి రేపాయి.

ఫ్యాను గాలికి అల్లల్లాడుతూ ఎగురుతున్న ఆమె పైట తనని ఆహ్వానిస్తున్న మత్తైన భావన. ఆచ్ఛాదన లేని ఆమె నడుము వంపును తన చేతిలో ఇముడ్చుకోవాలనే కోర్కెను ఆపుకోలేక నెమ్మదిగా అక్కడ చెయ్యివేశాడు నవీన్. అంతే... ఆమె చటుక్కున వెల్లికిలా తిరిగింది. ఆ తిరగటంలో ఆమె పైట పూర్తిగా తొలగిపోయి, అతను తూలి అప్రయత్నంగా ఆమె మీద పడిపోయాడు. ఎప్పుడూ పొందనిది, కొత్తదైన ఏదో హాయి, మనసూ శరీరం రెండూ ఏకమై సుఖాల అంచుల్ని తాకిరావాలన్న తపన. 'శయనేషు రంభా' పరవశంతో పలవరించాడు నవీన్.

''నో నో... అదిమాత్రం పెళ్ళయ్యాక తెలుసుకోవాల్సినది'' అంటూ దూరం నెట్టేసింది దివ్య.

★ ★ ★

'దివ్యా వెడ్స్ నవీన్'

రంగురంగుల దీప తోరణాల మధ్య అందంగా కాంతులీనుతూ అమరిన అక్షరాలు. ''ఆఁ... ఇక్కడే బాబూ! ఆటో ఆపు'' పేర్లు కూడా భలేగా మేచ్ అయ్యాయే అనుకుంటూ ఆటో దిగింది గీత. మొత్తానికి నువ్వు ఘటికురాలివే దివ్యా! నీ పెళ్ళి ఇంటర్వ్యూ కూడా నువ్వే ప్లాను వేసుకొని, అందులో సెలక్టయిపోయి ఈజీగా ఇల్లాలి పోస్ట్ కొట్టేశావ్'' చిన్నగా నవ్వుకుంటూ కళ్యాణ మంటపంలోనికి అడుగుపెట్టింది గీత.

☆



## ఇష్టం లేదు

**రంగీలా రాణి ఊర్మిళా ఒక్కోసారి చాలా బాగా మాట్లాడినట్టు ఉంటుంది. ఇంతకీ అసలు కథ ఏమిటంటే ఈమె నటించిన 'ఏక్ హసీనా థీ' చిత్రం పబ్లిసిటీలో ఈమెకి అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదని తెలుస్తోంది. ఈ సంగతే ఆమెని అడిగితే 'నాకేం తెలియదు. ఆ టైంలో నేనిక్కడ లేను. నేను దగ్గరలేనప్పుడు, నాకు తెలియని విషయాల గురించి మాట్లాడడం నాకు ఇష్టం ఉండదు. ఇదంతా మీడియా పనే. సయీఫ్ అలీఖాన్‌ని పబ్లిసిటీ వస్తువుగా వాడుకుంటున్నారు' అని విరుచుకుపడుతోంది. 'పబ్లిసిటీ కోసం ఇలాంటి కథలల్లడం ఏమీ బాగాలేదు' అని అంటోంది.**